సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా

ఆదివారం | 19 | నవంబర్ | 2023



261 మందికి వైద్యసేవలు

పద్మాపురంలో శనివారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో 261 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. IIలో



వాతావరణమిలా..

పాడేరు: అరకులోయలో 16.5, మినుమూలూరులో 16.5, చింతపల్లిలో 18.3 డిగ్రీల ఉష్ణోగ్రతలు శనివారం నమోదయ్యాయి.



వీకెండ్ సందడి

సాక్షి,పాడేరు: వంజంగి హిల్స్‌లో శనివారం పర్యాటకులు సందడి చేశారు.వీకెండ్ కావడంతో భారీగా తరలివచ్చారు.

న్యూస్‌రీల్

రక్షణ చర్యలు చేపట్టాలని వినతి



సబ్ కలెక్టర్ వినతిపత్రాన్ని అందజేస్తున్న ఆలయ అధికారులు

దేవీపట్నం: పోలవరం ప్రాజెక్ట్ నిర్మాణం కారణంగా దేవీపట్నం మండలం పోశమ్మగండి వద్ద గోదావరి నీటిమట్టం ప్రమాదకర స్థాయిలో ఉండడంతో ముందు జాగ్రత్తగా రక్షణ చర్యలు చేపట్టాలని జిల్లా అధికారులను దేవదాయశాఖ అధికారులు కోరారు. బయట వ్యక్తులు రాకుండా ఉండేలా చెక్‌పోస్టుల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని వారు రంపచోడవరం ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే, సబ్ కలెక్టర్ శుభం భన్సల్, ఏఎస్పీ జగదీష్ అడహళ్లికి వారు వినతి పత్రం అందజేశారు. ఎండోమెంట్ అసిస్టెంట్ కమిషనర్ చంద్రశేఖర్, ఆలయ ఈవో లక్ష్మీకుమార్ వారిని కలిశారు.

వాలీబాల్ పోటీలకు స్పోర్ట్స్ స్కూల్ విద్యార్థి



ఎంపికైన విద్యార్థి రాజ్‌కుమార్‌తో ప్రిన్సిపాల్ మూర్తి, కోచ్ మాధవ్

అరకులోయ టౌన్: జాతీయ స్థాయి వాలీబాల్ పోటీలకు ఏపీ గిరిజన సంక్షేమ బాలుర క్రీడా పాఠశాల విద్యార్థి కె.రాజ్‌కుమార్ ఎంపికైనట్టు ప్రిన్సిపాల్ పీఎఎస్ఎన్ మూర్తి తెలిపారు. తమ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న అతను ఈనెల 9వ తేదీ నుంచి 11వ తేదీ వరకు ఏపీ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో ప్రతిభ కనబరిచినట్టు ఆయన పేర్కొన్నారు. వచ్చే నెల భువనేశ్వర్‌లో జరిగే జాతీయ స్థాయిలో వాలీబాల్ పోటీల్లో రాష్ట్ర జట్టు తరఫున రాజ్‌కుమార్ పాల్గొంటున్నట్టు ఆయన వివరించారు. విద్యార్థితోపాటు, కోచ్ మాధవ్‌ను ప్రిన్సిపాల్ అభినందించారు.

ఓపెన్ టెన్త్, ఇంటర్ ప్రవేశాలకు గడువు పెంపు

విశాఖ విద్య: సార్వత్రిక విద్యాపీఠం ఆధ్వర్యంలో నిర్వహించే టెన్త్, ఇంటర్మీడియెట్ కోర్సుల్లో ప్రవేశాలకు గడువు పెంచినట్లు డీఈవో ఎల్. చంద్రకళ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 26 వరకు ఎటువంటి అపరాధ రుసుమ లేకుండా తగిన ధృవీకరణ పత్రాలతో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. రూ.200ల ఫైన్‌తో ఈ నెల 30 వరకు అవకాశం ఉందన్నారు. ఆసక్తి గల విద్యార్థులు సమీపంలోని ఓపెన్ స్కూల్ కేంద్రాల్లో సంప్రదించాలన్నారు.

సారా బట్టీలపై దాడులు

- 1,200 లీటర్ల బెల్లం పులుపు ధ్వంసం



పోలీసులు స్వాధీనం చేసుకున్న సారా తయారీ డ్రమ్ములు

కొయ్యూరు: రాజేంద్రపాలెం పంచాయతీ సూరేంద్రపాలెంలో శనివారం సారా బట్టీలపై దాడులు నిర్వహించారు. సుమారు 1,200 లీటర్ల బెల్లం పులుపును ధ్వంసం చేశారు. ఆపరేషన్ పరివర్తన్‌లో భాగంగా సీఐ స్వామినాయుడు ఆధ్వర్యంలో కొయ్యూరు, మంప ఎస్ఐలు రాజారావు, లోకేష్‌కుమార్ దాడులు చేశారు. సారా తయారీ పాత్రలు, డ్రమ్ములను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ సారా తయారీదారులను గుర్తించామని, వారిని త్వరలో అరెస్టు చేస్తామన్నారు. సారా తయారు చేసినా, విక్రయించినా చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

కాఫీ ఘుమఘుమలు



పాడేరు మండలం మోదాపల్లిలో విరగ్గాసిన కాఫీ



పాచ్‌మెంట్ కాఫీ గింజలను కొనుగోలు చేస్తున్న జీసీసీ సిబ్బంది

గ్రామాల్లో కాఫీ పండ్లు, గింజల కొనుగోళ్లతో సందడి నెలకొంది. ఈ ఏడాది గిరిజన సహకార సంస్థతోపాటు పాడేరు ఐటీడీఏ ఆధ్వర్యంలో మాక్స్ సొసైటీ కొనుగోలు చేపట్టాయి. గిరి రైతుల నుంచి మద్దతు ధరకు కొనుగోలు చేస్తుండటంతో దళారుల దోపిడీకి అడ్డుకట్ట పడింది.

- కొనుగోళ్లతో గ్రామాల్లో సందడి
- మద్దతు ధర చెల్లిస్తున్న జీసీసీ, మాక్స్ సొసైటీలు
- 16 వేల మెట్రిక్ టన్నులు సేకరించే అవకాశం



పాడేరు మండలం వంతాడపల్లిలో కాఫీ పండ్లను పల్పింగ్ చేస్తున్న గిరిజనులు

సాక్షి, పాడేరు: మన్యంలో కాఫీ అమ్మకాలు ప్రారంభమయ్యాయి. ఐటీడీఏ సూచన మేరకు కాఫీ పండ్లను చింతపల్లి మాక్స్ సొసైటీకి విక్రయిస్తున్నారు.ఏజెన్సీలోని 11 మండలాల పరిధిలో 2.40 లక్షల ఎకరాల్లో కాఫీ తోటలు ఉండగా 1.75 లక్షల ఎకరాల్లో ఫలసాయం ఇస్తున్నాయి. ఈ ఏడాది వాతావరణ పరిస్థితులు అనుకూలంగా ఉన్నందున గతేడాది కన్నా కాఫీ పండ్ల దిగుబడి పెరిగింది. గతేడాది 14 వేల మెట్రిక్ టన్నుల క్లీన్ కాఫీ గింజల దిగుబడి సాధించగా, ఈ ఏడాది 16 వేల మెట్రిక్ టన్నుల దిగుబడి వచ్చే అవకాశం ఉందని పాడేరు ఐటీడీఏ కాఫీ విభాగం అధికారులు అంచనా వేస్తున్నారు.

జీసీసీ ఆధ్వర్యంలో..

గిరిజన సహకార సంస్థ కూడా కాఫీ గింజల కొనుగోలును ఇటీవల ప్రారంభించింది. ఏజెన్సీలో 1500 టన్నుల కాఫీ గింజలను కొనుగోలు లక్ష్యంతో గ్రామాల్లో పూలింగ్ ఏజెంట్ల ద్వారా సేకరిస్తోంది. తూకం యంత్రాలతో జీసీసీ సిబ్బంది, పూలింగ్ ఏజెంట్లు కిలో రూ.280తో కాఫీ పాచ్‌మెంట్ గింజలను, చెర్రి కిలో రూ.145కు కొనుగోలు చేస్తున్నారు. జీసీసీ సీజన్ ప్రారంభంలోనే కిలో రూ.280కు కొనుగోలు చేయడం దళారుల దోపిడీకి చెక్ పెట్టినట్టయింది. చింతపల్లి మాక్స్ సొసైటీ విషయానికొస్తే పాడేరు ఐటీడీఏ కాఫీ విభాగం సహకారంతో కాఫీని పండ్ల దశలోనే కొనుగోలు చేస్తోంది. కిలోకు రూ.48 ధర చెల్లిస్తోంది.

తేమ శాతం పరిశీలన

చింతపల్లి రూరల్: మాక్స్ సొసైటీ ఆధ్వర్యంలో నాణ్యమైన పాచ్‌మెంట్ కాఫీ ఉత్పత్తుల కొనుగోలు లక్ష్యమని పాడేరు ఐటీడీఏ కాఫీ ప్రాజెక్ట్ ఏడీ అశోక్ తెలిపారు. శనివారం ఆయన స్థానిక కాఫీ పల్పింగ్ యూనిట్‌ను సందర్శించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాక్స్ సిబ్బంది కాఫీ పండ్ల సేకరణ లక్ష్యాన్ని అధిగమించాలన్నారు. మాక్స్‌కు విక్రయించడం వల్ల కలిగే ప్రయోజనాలపై రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. మ్యాక్స్ సొసైటీ అధ్యక్షుడు సెగ్గి కొండలరావు పాల్గొన్నారు.

ఆశాజనకంగా దిగుబడి



ఈ ఏడాది సకాలంలో వర్షాలు కురవడం, వాతావరణ పరిస్థితులు అనుకూలంగా ఉండడంతో కాఫీ తోటలు విరగ్గాశాయి. గతేడాది కన్నా ఈ ఏడాది దిగుబడులు అధికంగా ఉన్నాయి. సుమారు 16 మెట్రిక్ టన్నుల మార్కెటింగ్ జరిగే పరిస్థితులు కనిపిస్తున్నాయి. జీసీసీ పాచ్‌మెంట్ గింజలకు, చింతపల్లి మాక్స్ కాఫీ పండ్లను గిట్టుబాటు ధరతో కొనుగోలు చేస్తున్నాయి.

– అశోక్, కాఫీ ఏడీ, పాడేరు



పాచ్‌మెంట్ కాఫీలో తేమ శాతాన్ని పరిశీలిస్తున్న ఐటీడీఏ కాఫీ ప్రాజెక్ట్ ఏడీ అశోక్

'వికసిత్' సంకల్పయాత్రకు విశేష స్పందన



బడిమెలలో వికసిత్ భారత్ సంకల్పయాత్రలో డీఎంహెచ్‌వో డాక్టర్ జమాల్‌బాషా, అధికారులు

సాక్షి,పాడేరు: జిల్లాలో ప్రారంభమైన వికసిత్ భారత్ సంకల్ప యాత్రకు ప్రజల నుంచి విశేష ఆదరణ లభిస్తోంది. జిల్లాలో మూడు ప్రచార రథాలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాయి.పాడేరు మండలంలో నోడల్ అధికారి, ఎంపీడీవో కె. సాయి నవీన్ ఆధ్వర్యంలో శనివారం ఇరడాపల్లి, బడిమెల పంచాయతీల్లో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర నిర్వహించారు. కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖకు చెందిన ప్రతినిధులు వైద్య ఆరోగ్య కార్యక్రమాలను గిరిజనులకు సమగ్రంగా వివరించారు. జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి డాక్టర్ జమాల్‌బాషా వివిధ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించారు. వైద్య ఆరోగ్యశాఖ చేపడుతున్న కార్యక్రమాలను వివరించారు. స్థానిక ఆశా వర్కర్లు, ఆరోగ్యశాఖ సిబ్బంది అవగాహన ర్యాలీ నిర్వహించారు.

వ్యవసాయ శాఖ అధికారులకు డ్రోన్ల వినియోగం ప్రయోజనాలను వివరించారు. డీటీసీవీ డాక్టర్ టి.విశ్వేశ్వరరావు, ఎస్‌వో డాక్టర్ కైలాస్ , కేంద్ర ఆరోగ్యశాఖ ప్రతినిధి డాక్టర్ అనిల్ పాల్గొన్నారు. అరకులోయ మండల నోడల్ అధికారి, ఎంపీడీవో వెంకటేష్ ఆధ్వర్యంలో కొత్తబల్లుగూడలో వికసిత్ సంకల్పయాత్ర నిర్వహించారు. సర్పంచ్ కె.రాధిక, పీహెచ్‌సీ వైద్యాధికారి కిరణ్మయి, ఏపీఎం అప్పయమ్మ, పంచాయతీ కార్యదర్శి బి.విజయ కుమార్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. రంపచోడవరం మండలంలో నోడల్ అధికారి, ఎంపీడీవో హరికృష్ణ ఆధ్వర్యంలో వికసిత్ భారత్ సంకల్ప యాత్రలో భాగంగా వివిధ ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. జగరాంపల్లె, ఫోక్సుపేట, బీరంపల్లి, వూట్ల గ్రామాల్లో ప్రజలకు సీజనల్ వ్యాధులు, ఆరోగ్య సేవలపై అవగాహన కల్పించారు. ప్రభుత్వ పథకాల లబ్ధిదారులకు గుర్తింపు కార్డులు పంపిణీ చేశారు. ఐటీడీఏ పీఏఓ డాక్టర్ మదన్, కేవీకే శాస్త్రవేత్త లలితా కామేశ్వరి, మండల విస్తరణాధికారి జాన్ మిల్టన్, వైద్యాధికారులు డాక్టర్ కవిన్, డాక్టర్ సుజాత, నాబార్డు ఏడీఎం నాయుడు పాల్గొన్నారు.

బాలల హక్కులపై అవగాహన కల్పించాలి

ఏపీ బాలల హక్కుల కమిషన్ సభ్యురాలు ఉమాదేవి



ఇర్లపల్లి ఆశ్రమ పాఠశాలలో విద్యార్థినులతో మాట్లాడుతున్న ఉమాదేవి

రంపచోడవరం: బాలలకు హక్కులపై అవగాహన కల్పించాలని ఏపీ బాలల హక్కుల కమిషన్ సభ్యురాలు ఉమాదేవి ఆదేశించారు. శనివారం ఆమె రంపచోడవరం సమీపంలోని ఇర్లపల్లి గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలను సందర్శించారు. పాఠశాల విద్యార్థులతో మాట్లాడారు. వారికి అందించే ఆహార పదార్థాలను పరిశీలించారు.సంతృప్తి వ్యక్తం చేశారు. ఏజెన్సీ 11 మండలాల్లో ఉన్నత పాఠశాల హెచ్‌ఎంలకు నిర్వహిస్తున్న లెర్నింగ్ ఇంప్రూవ్‌మెంట్ ప్రోగ్రామ్‌లో ఆమె మాట్లాడారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలలకు ప్రత్యేక హక్కులు ఉంటాయన్నారు. వాటిని వారికి అర్థమయ్యే రీతిలో వివరించాలని సూచించారు. బాలల హక్కుల కమిషన్‌కు జ్యుడీషియల్ అధికారాలు ఉంటాయన్నారు. బాల్యవివాహాల నివారణకు అందరూ కృషి చేయాలని సూచించారు. కమిషన్‌కు 18 శాఖలపై అధికారాలు ఉన్నాయన్నారు. ప్రతీ పాఠశాలలో ఫిర్యాదుల పెట్టె కచ్చితంగా ఉండాలన్నారు. ఇతర శాఖల అధికారులు తరచూ పాఠశాలలను సందర్శించి బాలల హక్కులు, బాధ్యతలు గురించి వివరించాలని సూచించారు. ఆశ్రమ పాఠశాలల వసతి గృహాల విద్యార్థులను సొంత బిడ్డలుగా చూసుకోవడంతోపాటు వారి పట్ల ప్రత్యేకశ్రద్ధతో మెలగాలని సూచించారు. అనంతరం స్థానిక కేజీబీవీ పాఠశాలను సందర్శించారు. విద్యార్థుల హక్కులపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏజెన్సీ డీఈవో మల్లేశ్వరరావు, ఎంఈవో ఎం. సత్యనారాయణదొర పాల్గొన్నారు.

మరిన్ని ఎకో టూరిజం ప్రాజెక్టులు

ఏపీ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ మధుసూదనరెడ్డి

అనంతగిరి: పర్యావరణ పరిరక్షణతోపాటు పర్యాటకులకు ఆహ్లాదం కలిగించేలా అరకు ప్రాంతంలో మరిన్ని ఎకో టూరిజం ప్రాజెక్టుల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని ఏపీ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్టు వై.మధుసూదనరెడ్డి తెలిపారు. మండలంలోని చిలకలగెడ్డ చెక్‌పోస్టును ఆనుకొని అటవీశాఖ అభివృద్ధి చేసిన ఎకో టూరిజం పార్కును శనివారం ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మన్యం అంటేనే ఆహ్లాదకరమైన వాతావరణమని అందుకు తగ్గట్టుగానే పర్యాటకులను ఆకర్షించేలా ప్రాజెక్టులను రూపకల్పన చేస్తున్నామన్నారు. అటవీప్రాంతంలోని అరుదైన మొక్కలను పార్కుల వద్ద అందుబాటులో ఉంచి పర్యాటకులకు వాటిపై అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో విశాఖ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ శ్రీకాంత్ నాథ్‌రెడ్డి, పాడేరు డీఎఫ్‌వో వినోద్‌కుమార్, విశాఖ డీఎఫ్‌వో అనంత్ శంకర్, సబ్ డివిజనల్ ఫారెస్ట్ అధికారులు ఉమామహేశ్వరి, ధర్మరక్షిత్ రేంజర్ దుర్గా ప్రసాద్, సెక్షన్ ఆఫీసర్లు సత్యం, శ్రీహరి, సీతారాం పాల్గొన్నారు.

నేడు చింతపల్లి మండలంలో..

చింతపల్లి రూరల్: మండలంలో ఆదివారం ఏపీ ఫారెస్టు చీఫ్ కన్జర్వేటర్ వై.మధుసూదనరెడ్డి పర్యటించనున్నట్టు చింతపల్లి డీఎఫ్‌వో సూర్యనారాయణ తెలిపారు. చింతపల్లిలో నిర్మించిన డీఎఫ్‌వో కార్యాలయ భవనం, కృష్ణాపురంలో ఎకో టూరిజం పార్కు నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేస్తారని ఆయన వివరించారు.

పర్యావరణ పరిరక్షణ కోరుతూ సైకిల్ యాత్ర

గతేడాది హర్యానా నుంచి ప్రారంభం

అనంతగిరి: పర్యావరణ పరిరక్షణ కోరుతూ హర్యానాలోని ఖతైల్ జిల్లా ఖేరీసింబల్‌వాలి గ్రామానికి చెందిన అజయ్ అనే యువకుడు ఆల్ ఇండియా సైకిల్‌యాత్ర చేపట్టాడు. దీనిలో భాగంగా శనివారం మండల కేంద్రం అనంతగిరి మీదుగా అరకులోయ వెళ్తున్న అతను సాక్షితో కాసేపు మాట్లాడాడు. పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించేందుకు ఈ యాత్ర చేపట్టినట్టు పేర్కొన్నాడు. గతేడాది డిసెంబర్ 10న ఖేరీసింబల్‌వాలి గ్రామం నుంచి ప్రారంభించిన సైకిల్‌యాత్ర హర్యానా, ఉత్తరప్రదేశ్, బీహార్, వెస్ట్ బెంగాల్, సిక్కిం, అరుణాచల్, అసోం, మణిపూర్, మిజోరం, నాగలాండ్, త్రిపుర, మేఘాలయ, జార్ఖండ్, ఒడిశా తదితర 15 రాష్ట్రాల మీదుగా ఆంధ్రప్రదేశ్ చేరుకున్నట్టు తెలిపాడు. సైకిల్‌యాత్రలో భాగంగా పర్యావరణ పరిరక్షణ ప్రయోజనాలపై అవగాహన కల్పించి ప్రజలను చైతన్యపరిచినట్టు అజయ్ తెలిపాడు.



సైకిల్ యాత్ర చేస్తున్న అజయ్

జెడ్పీ అంచనా బడ్జెట్ రూ.1,363.16 కోట్లు



పాల్గొన్న సభ్యులు



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి అమర్‌నాథ్

- ఏకగ్రీవంగా ఆమోదించిన సభ్యులు
- పలు అంశాలపై సుదీర్ఘంగా చర్చ
- ప్రశాంతంగా ముగిసిన సర్వసభ్య సమావేశం

సాక్షి, విశాఖపట్నం: ఉమ్మడి విశాఖ జిల్లా పరిషత్ 2024–25 ఆర్థిక సంవత్సరానికి రూ.1,363.16 కోట్ల అంచనా ఆదాయ బడ్జెట్‌ను సర్వసభ్య సమావేశం ఆమోదించింది. అలాగే రానున్న ఆర్థిక సంవత్సరానికి రూ.1,362.95 కోట్ల వ్యయ బడ్జెట్‌ను ఆమోదిస్తూ తీర్మానించింది. ఇక ప్రస్తుత (2023–24) ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రూ.1,551.06 కోట్ల సవరణ బడ్జెట్‌కు కూడా ఏకగ్రీవంగా ఆమోదాన్ని తెలిపింది. జెడ్పీ చైర్‌పర్సన్ జె.సుభద్ర అధ్యక్షతన శనివారం జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం జెడ్పీ హాలులో జరిగింది. తొలుత గత సర్వసభ్య సమావేశాల్లో సభ్యులు లేవనెత్తిన అంశాలపై తీసుకున్న చర్యలను అధికారులు వివరించారు. పంచాయతీరాజ్ శాఖకు చెందిన 72 పనుల బిల్లుల మొత్తాన్ని పూర్తిగా చెల్లించినట్టు జెడ్పీ సీఈవో పోలినాయుడు సభ్యులకు చెప్పారు. జనరల్ ఫండ్‌కు చెందిన 105 బిల్లులను కూడా క్లియర్ చేశామని, నెల రోజుల్లో సంబంధిత ఖాతాల్లో సొమ్ము జమ అవుతుందని వివరించారు. అనంతరం వ్యవసాయ శాఖపై చర్చ జరిగింది. సెప్టెంబర్ ఆఖరు వరకు అనకాపల్లి జిల్లాలో ఆరు వేలు, విశాఖ జిల్లాలో వెయ్యి ఎకరాల్లోను వరి పంట ఎండిపోయిందని, అల్లూరి జిల్లాలోనూ వరి పంట దెబ్బతిందని, దీంతో ఖరీఫ్ దిగుబడులు తగ్గుతాయని వ్యవసాయ శాఖ అధికారులు చెప్పారు. ఈ పరిస్థితులను ప్రభుత్వానికి నివేదించామన్నారు. వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో ఉమ్మడి విశాఖ జిల్లాను కరువు జాబితాలో చేర్చాలని కోరుతూ తీర్మానించాలని సభ్యులు కోరారు. సభలో ఉన్న మంత్రి గుడివాడ అమర్‌నాథ్ మాట్లాడుతూ ఉమ్మడి విశాఖ జిల్లాలో 30–40 శాతం లోటు వర్షపాతం నమోదైందని, అక్టోబర్ ఆఖరు వరకు ఉన్న పంటల పరిస్థితిని ప్రభుత్వానికి నివేదించాలని అధికారులను ఆదేశించారు. కరువు పరిస్థితిపై సభలో తీర్మానం చేయాలని, తాను కూడా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు.

పీహెచ్‌సీల్లో రోస్టర్ విధానంలో ఉద్యోగ నియామకాలు

గిరిజన ప్రాంతాల్లోని పీహెచ్‌సీల్లో రోస్టర్ విధానంలో ఉద్యోగ నియామకాలు జరపాలని కలెక్టర్‌ను కోరుతున్నట్టు జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర పేర్కొన్నారు. అంగన్‌వాడీ పిల్లలకు సరైన ఆహారాన్ని అందించలేదని ఫిర్యాదు చేసినా పట్టించుకోని అనకాపల్లి జిల్లా ఐసీడీఎస్ పీడీపై చర్యలకు కలెక్టర్‌కు సిఫార్సు చేస్తామని ఆమె చెప్పారు. ఒకరోజే సర్వసభ్య సమావేశం నిర్వహించడంతో అజెండా అంశాలు పూర్తిగా చర్చకు రాకుండా ముగిసిపోతోందని, అందువల్ల రెండు పర్యాయాలు నిర్వహించాలని పరవాడ జెడ్పీటీసీ పైలా సన్యాసిరావు కోరారు. స్పందించిన జెడ్పీ సీఈవో పోలినాయుడు మెజార్టీ సభ్యుల అభిప్రాయాలకనుగుణంగా నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. ఏజెన్సీలో కొన్ని మారుమూల గ్రామాలకు విద్యుత్ సదుపాయం కల్పించడానికి అటవీ శాఖ అధికారులు అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నారని ఆ ప్రాంత సభ్యులు సభ దృష్టికి తెచ్చారు. ఇందులో తాము నిబంధనలు పాటిస్తున్నామే తప్ప తమ తప్పు లేదని అటవీశాఖ అధికారులు తెలిపారు.

కోరం లేక 'స్థాయీ' వాయిదా

ఉదయం 9 గంటలకు జెడ్పీ స్థాయీ సంఘాల సమావేశం జరగాల్సి ఉంది. అయితే కోరం లేకపోవడంతో అధికారులు దానిని మధ్యాహ్నానికి వాయిదా వేశారు. ఆ సమాచారం తమకు ముందుగా తెలియజేయలేదంటూ కొంతమంది సభ్యులు అధికారుల తీరుపై మండిపడ్డారు. వారిని అధికారులు సముదాయించి సర్ది చెప్పారు. సమావేశంలో వ్యవసాయం, వైద్యారోగ్యం, విద్య, డీఆర్‌డీఏ, పౌరసరఫరాలు, డ్వామా, అటవీ, విద్యుత్, ఆర్‌అండ్‌బీ తదితర శాఖలపై చర్చించారు. జెడ్పీ వైస్ చైర్మన్ గిరిబాబు, జెడ్పీటీసీలు, ఎంపీపీలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

261 మందికి వైద్యసేవలు

అరకులోయ రూరల్: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా మండలంలోని పద్మాపురం మేజర్ పంచాయతీలో శనివారం వైద్య శిబిరం నిర్వహించారు. సర్పంచ్ పెట్టేలి సుస్మిత, ఎంపీటీసీ సభ్యురాలు కుమారి రోగులకు మందులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం చేపడుతున్న ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. శిబిరంలో 261 మందికి వైద్య సేవలు అందించారు. రోగులను వైద్యాధికారులు ఉదయ్ ప్రశాంత్, సుసన్, వాణి, గాయత్రి పరీక్షించారు. సీజనల్ వ్యాధులపై జాగ్రత్తగా ఉండాలని సూచించారు. వైద్య సిబ్బంది చిన్నబాబు, నీలంబార్, నాయకులు రాజ్‌కుమార్, రఘునాథ్, సుంద్ర పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న మెజిస్ట్రేట్ ప్రవీర్

రంపచోడవరం: మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో బందపల్లిలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో శనివారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు.రంపచోడవరం ప్రథమశ్రేణి జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ చైర్మన్ బి.ప్రవీర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు మంచి నడవడికతో తమ లక్ష్యాలను చేరుకోవాలన్నారు. వివిధ చట్టాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. న్యాయవాది ఎ.వి.సత్యనారాయణ విద్యార్థులకు వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. అనంతరం మెజిస్ట్రేట్ వసతి గృహాన్ని తనిఖీ చేశారు.

కల్యాణం.. కమనీయం

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి నిత్య కల్యాణం శనివారం శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై అధిష్టింపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, సంకల్పం, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాన్ని అర్చకులు అందజేశారు. ప్రధానార్చకుడు ఇరగవరపు రమణాచార్యులు తదితరులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

ధాన్యాన్ని దళారులకు అమ్మి మోసపోవద్దు



మాట్లాడుతున్న జేసీ శివ శ్రీనివాస్, వేదికపై పీవో



సమావేశానికి హాజరైన అధికారులు



ఇందుకూరుపేటలో ఆర్‌బీకేని పరిశీలిస్తున్న జేసీ

- జిల్లాలో 30 వేల మెట్రిక్ టన్నుల కొనుగోలు లక్ష్యం
- జాయింట్ కలెక్టర్ శివశ్రీనివాస్

రంపచోడవరం: గిరి రైతులు ధాన్యాన్ని దళారులకు అమ్మి మోసపోకుండా ఉండేందుకు కొనుగోలు కేంద్రాలను ఏర్పాటుచేస్తున్నట్టు శివ శ్రీనివాస్ తెలిపారు.శనివారం స్థానిక ఐటీడీఏ సమావేశ మందిరంలో పీవో సూరజ్ గనోరే, సబ్ కలెక్టర్ శుభం బన్సల్‌లతో కలిసి తహసీల్దార్లు, వ్యవసాయశాఖ అధికారులు, మిల్లర్లతో ధాన్యం కొనుగోలుపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ రంపచోడవరం డివిజన్‌లోని 11 మండలాల పరిధిలో 46 ధాన్యం కొనుగోలు కేంద్రాలు, పాడేరు డివిజన్‌లో 24 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. గత ఏడాది 28వేల మెట్రిక్ టన్నుల ధ్యాం కొనుగోలు చేసినట్టు పేర్కొన్నారు. ఈ ఏడాది 30 వేల మెట్రిక్ టన్నులు ధాన్యం కొనుగోలు లక్ష్యంగా పెట్టుకున్నామని చెప్పారు. కొనుగోలు కేంద్రాల నుంచి ధాన్యాన్ని తరలించే వాహనాలకు జీపీఎస్ ట్రాకింగ్ వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు. కొనుగోలు కేంద్రాల్లో టెక్నికల్ అసిస్టెంట్లు, సాంకేతిక సిబ్బంది, కంప్యూటర్ ఆపరేటర్లు ఎక్కడిక్కడ వెంటనే విధులకు హాజరు కావాలని ఆయన ఆదేశించారు. ధాన్యం కొనుగోలుకు అవసరమైన పరికరాలపై వ్యవసాయ అధికారులతో చర్చించారు. కొనుగోలు కేంద్రాలలో బయోమెట్రిక్ కూడా ఏర్పాటు చేస్తామని తెలిపారు. జీసీసీ గొడౌన్‌ల్లో ఉన్న గోనె సంచులు అన్ని ధాన్యం కొనుగోలు కేంద్రాలకు చేరవేయాలని ఆదేశించారు. పీవో సూరజ్‌గనోరే మాట్లాడుతూ ప్రతి మండలంలోని రైతు భరోసా కేంద్రాల పరిధిలో రైతుల వివరాలు మండల వ్యవసాయ శాఖ అధికారుల వద్ద ఎప్పటికప్పుడు అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలకు సంబంధించిన సిబ్బంది మండల వ్యవసాయ శాఖ అధికారుల ఆధ్వర్యంలో పని చేయాలని ఆదేశించారు. గిరిజన రైతులకు ధాన్యం కొనుగోలు కేంద్రాలపై అవగాహన కలిగించాలని సూచించారు. గిరిజనులు పండించే అపరాల కొనుగోలుకు ప్రణాళిక సిద్ధం చేయాలని వ్యవసాయ అధికారులను ఆదేశించారు. సబ్ కలెక్టర్ శుభం బన్సల్ మాట్లాడుతూ ఏజెన్సీలోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను సంబంధిత తహసీల్దార్లు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు. రైస్ మిల్లర్లు ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ఈ సమావేశంలో సివిల్ సప్లయి మేనేజర్ గణేష్‌కుమార్, డీఎస్వో శ్యామ్‌కుమార్, ఏడీఏ సీహెచ్‌కెవీ చౌదరి, తహసీల్దార్లు శ్రీమన్నారాయణ, శ్రీనివాసరావు, సత్యనారాయణ, ఏవో లక్ష్మణరావు పాల్గొన్నారు.

రైతు భరోసా కేంద్రం సందర్శన

దేవీపట్నం: మండలంలోని ఇందుకూరుపేట రైతు భరోసా కేంద్రాన్ని జాయింట్ కలెక్టర్ శివశ్రీనివాస్ శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు భరోసా కేంద్రాల ద్వారా ధాన్యాన్ని మద్దతు ధరకు కొనుగోలు చేస్తామన్నారు.

ప్రకృతి సాగుతో అధిక దిగుబడులు

పెదబయలు: మండలంలోని గలగండ పంచాయతీ సిరశపల్లి, ఈదులపుట్టు గ్రామాల్లో ఉన్న సుసాగ్ చిరు ధాన్యాల చెల్లెళ్ల సంఘం ఫార్మర్స్ ప్రొడ్యూసర్స్ ఆర్గనైజేషన్ పరిధిలో వరి,రాగి సాగులో మేలైన పద్ధతులపై 14 వారాల పాటు ఇండి గ్యాప్ పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ సేంద్రియ ఉత్పత్తుల ధృవీకరణ సంస్థ లాం ఫార్మ్ గుంటూరు తనిఖీ అధికారి డాక్టర్ ఎస్ రాజు ,జిల్లా వ్యవసాయ అధికారి ఎస్‌బి నందు అన్నారు. శనివారం రెండు గ్రామాల పరిధిలో చెల్లెళ్ల సంఘం నుంచి 50 మంది మహిళ రైతులకు ఇండి గ్యాప్ జూన్ నెల నుంచి 14 వారాల పాటు ఇండిగ్యాప్ పొలంబడి కార్యక్రమం నిర్వహించనున్నట్టు చెప్పారు. రసాయన ఎరువులు. పురుగుమందులు వాడకుండా కేవలం ప్రకృతి వ్యవసాయం చేస్తే అధిక లాభం పొందవచ్చన్నారు. సహాయ సంచాలకులు బి.ప్రభాకర్. జిల్లా వనరుల కేంద్రం సహాయ సంచాలకులు విజయలక్ష్మీ,మండల వ్యవసాయ అధికారి ఏ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



సిరశపల్లిలో వరి, రాగుల నమూనాలు సేకరించిన రాష్ట్ర అధికారులు



సిరశపల్లిలో పొలంబడి కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర, జిల్లా అధికారులు

20న కుల గణనపై సదస్సు

మహారాణిపేట: వీఎంఆర్‌డీఏ సమావేశ మందిరంలో ఈ నెల 20న కుల గణనపై ప్రాంతీయ సదస్సు నిర్వహిస్తున్నారు. ఉత్తరాంధ్ర జిల్లాలకు చెందిన స్టేక్ హోల్డర్లతో ఈ సమావేశం జరగనుంది. కులాల వారీగా జనాభా, వారి సామాజిక, విద్య, ఆర్థిక పురోభివృద్ధి తెలుసుకోవడానికి, సముచిత విధాన నిర్ణయాలు చేపట్టడానికి ఈ నెల 27న రాష్ట్ర వ్యాప్తంగా సర్వే నిర్వహిస్తున్నారు. సచివాలయ స్థాయిలో మొబైల్ యాప్ ద్వారా ఈ సర్వే చేస్తున్నారు. ఈ నేపథ్యంలో వివిధ వర్గాల అభిప్రాయాలు, సూచనలు, సలహాలు తెలుసుకోవడానికి జిల్లా, ప్రాంతీయ సదస్సులు నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశించింది. ఇందులో భాగంగా ఈ నెల 20న విశాఖలో ఉత్తరాంధ్ర ప్రాంతీయ సదస్సు నిర్వహిస్తున్నారు.

వచ్చే నెల 15 నుంచి ఆడుదాం ఆంధ్ర

- ఈనెల 20 నుంచి ఆటగాళ్ల నమోదు
- రాష్ట్ర స్థాయి పోటీలకు విశాఖ వేదిక



ఆడుదాం ఆంధ్ర నిర్వహణపై సమావేశం నిర్వహిస్తున్న కలెక్టర్ మల్లికార్జున

విశాఖ స్పోర్ట్స్ : ఆడుదాం ఆంధ్ర టోర్నమెంట్ ఐదు స్థాయిల్లో డిసెంబర్ 15 నుంచి జనవరి 26వ తేదీ వరకు జరగనుందని కలెక్టర్ ఎ.మల్లికార్జున తెలిపారు. ప్రతిష్టాత్మకంగా గ్రామీణ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు నిర్వహించ తలపెట్టిన ఆడుదాం ఆంధ్ర టోర్నమెంట్ నిర్వహణపై సన్నాహక సమావేశం శనివారం కలెక్టర్ ఎ.మల్లికార్జున నిర్వహించారు. వార్డు స్థాయి నుంచి జరగనున్న ఈ పోటీల్లో పాల్గొనేందుకు ఆటగాళ్ల నమోదు కార్యక్రమాన్ని ఈనెల 20 నుంచి ప్రారంభం కానుందని, 19న సంబంధిత యాప్, వీడియోను విడుదల చేయనున్నామన్నారు. 21 నుంచి పాల్గొనే ఆటగాళ్లకు స్పోర్ట్స్ కిట్స్ అందించనున్నామన్నారు. మంచి ట్రాక్ రికార్డు ఉన్న క్రీడాకారులకు అంబాసిడర్ హోదా కల్పిస్తామన్నారు. రవాణా, ఆహార, తాగునీరు, వైద్య సదుపాయాలు, ఇతర వసతుల కల్పనకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు విశాఖ వేదికకానుందన్నారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ విశ్వనాథన్, సెట్విస్ సీఈవో కీర్తి, డీఎస్ఏ చీఫ్ కోచ్ గాలియట్, వివిధ విభాగాల జిల్లా స్థాయి అధికారులు ప్రత్యక్షంగా పాల్గొనగా.. సచివాలయ, మండల, నియోజకవర్గ స్థాయి అధికారులు ఆన్‌లైన్‌లో పాల్గొన్నారు.

ఐదు క్రీడాంశాల్లో... : తొలిసారిగా రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించ తలపెట్టిన ఆడుదాం ఆంధ్రలో ఐదు క్రీడల్లో పోటీలు జరగనున్నాయి. క్రికెట్, బాడ్మింటన్, వాలీబాల్, కబడ్డీతో పాటు ఖోఖో పోటీలు నిర్వహించనున్నారు. ఐదు స్థాయిల్లో ఈ పోటీలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. నగదు పారితోషికాలతో జట్లను ప్రోత్సహించనున్నారు. వార్డు స్థాయిలో మొదలై మండల, నియోజకవర్గం, జిల్లా, రాష్ట్ర స్థాయితో ముగియనున్నాయి. పదిహేనేళ్లు పూర్తి చేసిన వారంతా ఈ పోటీల్లో పాల్గొనేందుకు అర్హులు.

22న ట్రయిల్ మ్యాచ్‌లు : తొలి స్థాయిల్లో బేసిక్ నిబంధనలతో పోటీలకు అర్హత కల్పించినా.. నియోజకవర్గ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు మూడు దశల్లోనూ పూర్తి నిబంధనల మేరకే టోర్నీ జరగనుంది. ఈ స్థాయిల్లో రాణించిన జట్లకే నగదు ప్రోత్సాహకాలు అందనున్నాయి. ఈనెల 22న ట్రయిల్ మ్యాచ్‌లు జరగనుండగా 25 నుంచి ఇంటింటికి వలంటీర్ల సర్వే చేపట్టనున్నారు. ఇంకేందుకు ఆలస్యం వార్డు స్థాయిలో ఆటగాళ్లు పేర్లను నమోదు చేసుకోండి.

ఘనంగా లక్ష తులసి పూజ

పెందుర్తి: వెంకటాద్రిపై కొలువుదీరిన వేంకటేశ్వర స్వామి సన్నిధిలో పవిత్రోత్సవాల్లో బాగంగా రెండోరోజు శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామికి లక్ష తులసి అర్చన విశేషంగా చేశారు. సప్త హారతులు సమర్పించారు. ఆదివారం యాగశాల అర్చన, వేంకటేశ్వర హోమం, సాయంత్రం గోదా పద్మాదేవి సహిత వేంకటేశ్వరస్వామి కల్యాణం జరుగుతాయి.

బిగ్ స్క్రీన్‌పై ఫైట్



బీచ్‌రోడ్డులో బిగ్ స్క్రీన్

- నేడు భారత్–ఆస్ట్రేలియా టైటిల్ పోరు
- సాగరతీరంలో ఏసీఏ ఆధ్వర్యంలో భారీ తెరపై ప్రత్యక్ష ప్రసారం

విశాఖ స్పోర్ట్స్: క్రికెట్ ప్రపంచకప్‌లో భాగంగా భారత్–ఆస్ట్రేలియా జట్ల మధ్య ఆదివారం జరగనున్న ఫైనల్ మ్యాచ్ కోసం యావత్ ప్రపంచం ఉత్కంఠగా ఎదురుచూస్తోంది. అసలు సిసలైన క్రికెట్ మజాను ఆస్వాదించేందుకు ఎవరి ఏర్పాట్లలో వారు తలమునకలయ్యారు. ప్రత్యక్షంగా మ్యాచ్‌ను వీక్షించేందుకు పలువురు అహ్మదాబాద్ తరలివెళ్లారు. ప్రత్యక్షంగా చూడలేని అభిమానుల కోసం.. స్టేడియంలో మ్యాచ్‌ను చూస్తూ పొందే అనుభూతిని అందించేందుకు ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ ఏర్పాట్లు చేసింది. ఇప్పటికే భారత్–న్యూజిలాండ్ జట్ల మధ్య జరిగిన సెమీ ఫైనల్ మ్యాచ్‌ను విశాఖ, విజయవాడ, వైఎస్సార్ కడప జిల్లాల్లోని కేంద్రాల్లో భారీ స్క్రీన్‌లపై ప్రత్యేక ప్రసారం చేసింది.

భారీ సంఖ్యలో అభిమానులు తరలివచ్చి మ్యాచ్‌ను ఆద్యంతం ఎంజాయ్ చేశారు. ఈ నేపథ్యంలో టైటిల్ పోరును రాష్ట్రంలోని 13 ఉమ్మడి జిల్లా కేంద్రాల్లో బిగ్ స్క్రీన్లపై ప్రత్యక్ష ప్రసారం చేయాలని ఏసీఏ నిర్ణయించింది. ఈ మేరకు విశాఖ సాగరతీరంలోని కాళీమాత ఆలయం ఎదురుగా జిల్లా యంత్రాంగంతో కలిసి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. ఈ సందర్భంగా ఏసీఏ అపెక్స్ కౌన్సిల్ కార్యదర్శి ఎస్ఆర్ గోపీనాథ్‌రెడ్డి.. 'సాక్షి'తో మాట్లాడారు.

అపెక్స్ కౌన్సిల్ నిర్ణయం మేరకు బిగ్ స్క్రీన్లపై సెమీ ఫైనల్ మ్యాచ్‌ను ప్రత్యక్ష ప్రసారం చేయగా.. అభిమానుల నుంచి భారీ స్పందన వచ్చిందన్నారు. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు 13 ఉమ్మడి జిల్లాల కేంద్రాల్లో బిగ్‌స్క్రీన్లు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. అలాగే సౌండ్, ఫుడ్‌కోర్టులు, టెంట్లు తదితర సౌకర్యాలు కల్పిస్తున్నట్లు తెలిపారు.

నేటి నుంచి టీటీడీ క్యాలెండర్ల విక్రయాలు

ఎంవీపీకాలనీ (విశాఖ): తిరుమల తిరుపతి దేవస్థానం క్యాలెండర్లు, డైరీల విక్రయాలు ఆదివారం నుంచి ప్రారంభంకానున్నాయి. శ్రీ వెంకటేశ్వరస్వామి చిత్రపటంతో కూడిన పెద్ద క్యాలెండర్ రూ.20, చిన్న క్యాలెండర్ రూ.15, 12 షీట్స్ క్యాలెండర్ రూ.130లకు విక్రయిస్తున్నట్లు టీటీడీ మేనేజర్ హైమావతి తెలిపారు. శ్రీవారి చిత్రపటంతో కూడిన డీలక్స్ డైరీ రూ.150, తెలుగు పంచాంగం రూ.30, టేబుల్ టాప్ క్యాలెండర్ రూ.75 విక్రయించడం జరుగుతుందన్నారు. దీంతో పాటు ఈ ఏడాది శ్రీవారి సేవలో వినియోగించిన పుష్పాలతో తయారు చేసిన స్పెషల్ క్యాలెండర్ అందుబాటులో ఉందన్నారు. దీన్ని రూ.600లకు విక్రయిస్తున్నట్లు తెలిపారు. ఆదివారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఎంవీపీ కాలనీలోని టీటీడీ కల్యాణ మండపంలో విక్రయాలు జరుగుతాయన్నారు.



టీటీడీ డైరీలు, క్యాలెండర్లు